క్లుప్తంగా

పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం



నెహ్రూనగర్: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా బాలింతలు, గర్భవతులు, చిన్నారులు ఆరోగ్యంగా ఉండవచ్చని కార్పొరేటర్లు అబీద్, మీరావలి, వైఎస్సార్ సీపీ తూర్పు మహిళా నాయకురాలు నూరీ ఫాతిమా పేర్కొన్నారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు, మధ్య వయస్సు మహిళలకు చిరుధాన్యాలపై ఐసీడీఎస్- ఏ సెక్టార్ పరిధిలోని ఆనందపేటలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐసీడీఎస్ పీడీ బి. మనోరంజని మాట్లాడుతూ చిరుధాన్యాల్లో పోషకాలు ఎక్కువగా ఉంటాయని, ప్రతి ఒక్కరూ ఆహారంలో ఎక్కువగా వాటిని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అర్బన్ సీడీపీఓ కృష్ణవేణి, ఏసీడీపీఓ చంద్రకళ, అర్బన్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

ఆర్టీఏ ఆధీనంలో వాహనాలకు వేలం పాట

పట్నంబజారు: ఏళ్ల తరబడి పలు కేసులు నమోదై రవాణా శాఖ అధికారుల ఆధీనంలో ఉన్న పలు వాహనాలకు గురువారం వేలం పాట నిర్వహించారు. స్వర్ణభారతీనగర్‌లోని ఆర్టీవో కార్యాలయంలో డీటీసీ షేక్ కరీం ఆధ్వర్యంలో 35 వాహనాలకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఇందులో 19 గూడ్స్ క్యారియర్ వాహనాలు, తొమ్మిది ద్విచక్ర వాహనాలు, ఒక మోటారు కారు, మూడు ఆటోలు, ఒక పాఠశాల బస్సు, రెండు మ్యాక్సీ క్యాబ్‌లు ఉన్నాయి. పలువురు వ్యాపారులు వేలంలో పాల్గొని మొత్తం వాహనాలను రూ. 9,14,077కు దక్కించుకున్నారు.

హక్కుల సాధన కోసమే పోరాటం

గుంటూరు వెస్ట్: చట్ట ప్రకారం తమకు దక్కాల్సిన కనీస హక్కుల కోసమే ఉద్యమిస్తున్నామని, ఒక్క మాటలో చెప్పాలంటే తప్పనిసరి పరిస్థితుల్లో పోరాటం చేస్తున్నామని అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. గత 15 రోజుల నుంచి ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసనలో భాగంగా గురువారం స్థానిక కలెక్టరేట్‌లో బొప్పరాజు మాట్లాడారు. ఉద్యోగుల హక్కులు భిక్షం కాదన్నారు. గత మూడు రోజుల నుంచి వర్క్ టు రూల్ విధానాన్ని పాటిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ అమరావతి గుంటూరు చైర్మన్ కనపర్తి సంగీతరావు, కార్యదర్శి కిరణ్ కుమార్, ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా డిజిటల్ బ్యాంకింగ్ యూనిట్ ప్రారంభం



కొరిటెపాడు: గుంటూరు సమీపంలోని కాశీ గార్డెన్స్ ప్రాంగణంలో బ్యాంక్ ఆఫ్ బరోడా డిజిటల్ బ్యాంకింగ్ యూనిట్ నంబూరు బ్రాంచ్‌ను చంద్ర కాళీ ప్రసాద మాతాజీ గురువారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ జోనల్ హెడ్ చీఫ్ జనరల్ మేనేజర్ మన్మోహన్ గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి డిజిటల్ బ్యాంకింగ్ యూనిట్‌ను కాశీ గార్డెన్స్ ప్రాంగణంలో ప్రారంభించడం అభినందనీయమని తెలిపారు. సేవల్ని ఖాతాదారులువినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రీజనల్ హెడ్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పి. అమర్‌నాథ్‌రెడ్డి, డెప్యూటీ రీజనల్ మేనేజర్ ఎం. విద్యాసాగర్, బ్యాంకు అధికారులు, సిబ్బంది, డిజిటల్ బ్యాంకింగ్ యూనిట్ గుంటూరు బ్రాంచ్ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ రవిశంకర్ పాల్గొన్నారు.

కంటి వెలుగు స్క్రీనింగ్ టెస్ట్‌లు ప్రారంభం

గుంటూరు రూరల్: కళ్లు ప్రధానమైనవని, వాటిని కాపాడుకోవాలని ఏపీఎంవో లీలావతి తెలిపారు. 47వ డివిజన్ గోరంట్ల 198వ వార్డు సచివాలయం పరిధిలో కంటి వెలుగు స్క్రీనింగ్ టెస్ట్‌లను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఎంవో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చర్యలు

నగర కమిషనర్ కీర్తి చేకూరి



ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో ఎక్కడా తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. తన చాంబర్‌లో గురువారం నగరంలో తాగునీటి సరఫరా, అభివృద్ధి పనుల్లో ఇతర శాఖల సమన్వయం, పార్కుల అభివృద్ధి తదితర అంశాలపై నగర పాలక సంస్థ ఇంజినీరింగ్, విద్యుత్ శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీటి సరఫరాపై ఏఈల వారీగా సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వార్డు పేరు కనిపించేలా బోర్డులు ఏర్పాటు చేయాలని, నగరపాలక సంస్థ జెట్టింగ్ మెషిన్ లకు టోల్ ఫ్రీ నంబర్ పెయింట్ చేయాలని చెప్పారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 పనుల్లో ప్రజారోగ్య శాఖతో ఇంజినీరింగ్ అధికారులు సమన్వయం చేసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. నగరంలో గుర్తించిన జంక్షన్‌లలో నిర్దేశిత ప్లాన్ ప్రకారం అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు. గాంధీ పార్కు పనులు పూర్తి చేసి ఈ నెలలోనే ప్రారంభానికి సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. రోడ్ల విస్తరణ పనులు జరిగిన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్ వెంటనే చేపట్టాలని సీపీడీసీఎల్ అధికారుల్ని కోరారు. నిర్మాణ దశలో ఉన్న రెండు వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్ని త్వరగా పూర్తి చేసి, ప్రారంభానికి సిద్ధం చేయాలని త తెలిపారు. 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులతో చేపట్టిన పనుల్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని చెప్పారు. కోర్ట్ కేసుల్లో నిర్దేశిత గడువులోగా కౌంటర్స్, అఫిడవిట్స్ వేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ భాస్కర్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, ఈఈలు సుందరరామిరెడ్డి, కొండారెడ్డి, కోటేశ్వరరావు, ఏపీ సీపీడీసీఎల్ ఈఈ శ్రీనివాసబాబు, ఏడీహెచ్ రామారావు, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

1 నుంచి జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో వర్క్‌షాప్



వర్క్‌షాప్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్, రిజిస్ట్రార్ కరుణ తదితరులు

ఏఎన్‌యూ: నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో ఏప్రిల్ ఒకటి నుంచి మూడో తేదీ వరకు జాతీయ స్థాయి వర్క్‌షాప్ జరగనుంది. వర్క్‌షాప్ పోస్టర్‌ను గురువారం వీసీ పి. రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్ డైరెక్టర్, జర్నలిజం విభాగ అధ్యాపకుడు జె. మధుబాబు మాట్లాడుతూ 'సినిమా- సామాజిక అవసరత' అనే అంశంపై జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. సామాజిక సమాంతర చలన చిత్రాలపై విశ్లేషణ, భారతదేశంలో చలన చిత్ర రంగ అభివృద్ధి, దళిత, మానవ హక్కుల ఉల్లంఘన, మహిళల సమస్యలు, హింస వంటి చలన చిత్రాలపై చర్చ జరుగుతుందని పేర్కొన్నారు. కీలకోపన్యాసకులుగా గిరీష్ కాసరవల్లి (బెంగుళూరు), షాజీ ఎన్. కరుణ్ (త్రివేండ్రమ్),సి.ఉమామహేశ్వరరావు, ఎం.వి.రఘు, పి.సునీల్‌కుమార్‌రెడ్డి, ఆర్.వి.రమణి, బుర్రా సాయి మాధవ్, బసవ శ్రీవిద్య, సీనియర్ ఎడిటర్ తెలకపల్లి రవి, ఢిల్లీ జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ కృష్ణ శంకర్ కుసుమ, కేరళ కేంద్రీయ విశ్వ విద్యాలయానికి చెందిన డాక్టర్ వెల్లక్కీల్ రాఘవన్, చలనచిత్ర విశ్లేషకులు రెంటాల జయదేవ్ తదితరులు పలు అంశాలపై ప్రసంగిస్తారని వివరించారు. సదస్సుకు జర్నలిజం విభాగాధిపతి జి. అనిత కోశాధికారిగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు జర్నలిజం అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

పన్ను రాయితీని సద్వినియోగం చేసుకోవాలి



ఎల్‌టీపీలతో సమావేశమైన సీపీ ప్రదీప్‌కుమార్

నెహ్రూనగర్: ఏకమొత్తంగా ఆస్తి, ఖాళీ స్థల పన్నులు చెల్లిస్తే, వాటిపై వడ్డీని మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల గడువు మరో ఎనిమిది రోజుల్లో ముగియనుందని సిటీప్లానర్ ప్రదీప్ కుమార్ తెలిపారు. ఈ విషయాన్ని భవన నిర్మాణ యజమానులకు లైసెన్స్‌డ్ టెక్నికల్ ఇంజినీర్లు (ఎల్‌టీపీ) తెలియచేసి వారు పన్ను రాయితీని వినియోగించుకునేలా చూడాలని ఆయన కోరారు. ఆయన గురువారం కమిషనర్ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఎల్‌టీపీలతో ఖాళీ స్థల పన్ను వసూళ్లు, పన్ను రాయితీపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న భవన యజమానుల నుంచి ఖాళీ స్థల పన్ను వసూళ్లకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రభుత్వం ఇచ్చిన పన్ను రాయితీ ద్వారా భారీ మొత్తంలో లబ్ధి చేకూరుతుందని తెలిపారు. కొందరు ఖాళీ స్థల యజమానులు ఏళ్ల తరబడి పన్ను చెల్లించకుండా ఉన్నారని, వారికి పెద్ద మొత్తంలో వడ్డీ జమ అయిందని, వారికి కూడా పన్ను రాయితీ ద్వారా మినహాయింపు వస్తుందని పేర్కొన్నారు. భవన నిర్మాణదారులు కూడా నిర్మాణం పూర్తయ్యే వరకు లేదా ఆక్యుపెన్సీ వరకు వేచి చూడకుండా ఈ నెల 31లోపు పన్ను చెల్లించాలని, లేనిపక్షంలో వచ్చే నెల 1 నుంచి వడ్డీ కలిపే చెల్లించాలని చెప్పారు. ఇక నుంచి నగరపాలక సంస్థ నుంచి జారీ చేసే అనుమతులకు ఖాళీ స్థల పన్ను చెల్లించిన ఎన్‌ఓసీ తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ఎల్‌టీపీలు తమకు క్షేత్ర స్థాయిలో నగరపాలక సంస్థ ద్వారా పరిష్కరించాల్సిన అంశాల్ని సిటీప్లానర్ దృష్టికి తీసుకురాగా, త్వరలో నగర కమిషనర్‌తో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. సమావేశంలో డెప్యూటీ సిటీప్లానర్ కోటయ్య, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, క్రెడాయ్, నెరెడ్కో ప్రతినిధులు, అసిస్టెంట్ సిటీప్లానర్లు, టీపీఎస్‌లు, ఆర్‌ఓలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

అదృశ్యమైన యువకుడు ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: కనిపించకుండా పోయిన యువకుడు ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. కోబాల్డ్‌పేట 7వ లైనుకు చెందిన చెవుల మల్లికార్జునరావు (28) గతనెల 26న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీనిపై కుటుంబ సభ్యులు ఈనెల 10న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే, మల్లికార్జునరావు మృతదేహాన్ని తాడేపల్లి సమీపంలోని వడ్డేశ్వరం మద్రాస్ కెనాల్‌లో గురువారం గుర్తించారు. జేబులోని ఆధార్ కార్డును బట్టి స్థానిక పోలీసులు పట్టాభిపురం పోలీసులకు సమాచారం ఇచ్చారు.

మహిళ అదృశ్యం

గుంటూరు ఈస్ట్: మహిళ అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కోదండరామయ్యనగర్‌లోని ఓ కుటుంబానికి చెందిన మహిళ గురువారం ఇంట్లోంచి వెళ్లిపోయింది. ఆమె కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జూదరుల అరెస్టు

పేకాట ఆడుతున్న ఆరుగురిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. భారత్‌పేట 3వ లైనులో కొందరు పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు గురువారం దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ. 6,420 స్వాధీనం చేసుకున్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

అధిక కట్నం కోసం భర్త, అతని కుటుంబ సభ్యులు మహిళను వేధించి ఇంట్లోంచి తరిమి వేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీ అగ్రహారానికి చెందిన మోతడక సుచిత్రకు, యశ్వంత్‌కు 2021లో వివాహమైంది. యశ్వంత్, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు సుచిత్రను అధిక కట్నం తేవాలంటూ వేధింపులకు గురిచేసి ఇంట్లో నుంచి తరిమి వేశారు. ఈ మేరకు బాధితురాలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వ్యక్తిపై దాడి

వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. సీతమ్మకాలనీకి చెందిన శీలం ఆంజనేయులు గురువారం ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతున్నాడు. ఈ సమయంలో కోటి అనే వ్యక్తి తన కుమారుడు తరుణ్ నాగసందీప్‌ను కొడుతున్నాడు. ఆంజనేయులు బండి ఆపి కొట్టవద్దంటూ అడ్డుకున్నాడు. దీనిపై ఆంజనేయులు, కోటికి మధ్య గొడవ జరిగింది. కోటి ఇంట్లోకి వెళ్లి కత్తి తీసుకొని కుటుంబ సభ్యుల్ని వెంటబెట్టుకొచ్చాడు. ఆంజనేయులు ఎడమ భుజంపై కత్తితో దాడి చేశాడు. గాయపడిన ఆంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రముఖులకు ఉగాది పురస్కారాలు



కార్యక్రమంలో పాల్గొన్న భాష్యం రామకృష్ణ, ప్రసాదరావు, వీరాంజనేయులు



పురస్కార గ్రహీతలతో రంగారావు తదితరులు

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఉగాది పురస్కరించుకుని భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక సంస్థ వ్యవస్థాపకుడు మిరియాల ప్రసాదరావు ఆధ్వర్యంలో గురువారం పలువురు ప్రముఖులకు ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, చందు సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సినీ సంగీత విభావరిలో గాయకులు ప్రసాదరావు, మేకల పురుషోత్తమ్ ప్రసాద్ తదితరులు సినీ పాటల్ని ఆలపించి ప్రేక్షకుల్ని అలరించారు. అనంతరం డాక్టర్ పి. విజయ, డాక్టర్ సీహెచ్. అమూల్య, బీసీ కార్పొరేషన్ ఈడీ డి. దుర్గాబాయి, సివిల్ సప్లయిస్ జీఎం జి.లక్ష్మి, అన్నదాన సమాజం ఈవో డి. ప్రమీలా రాణి, కాకి భాగ్యలక్ష్మి, మేకల శేషుకుమారికి పురస్కారాలు అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, మిరియాల గోపీకుమార్, సంగీతాభిమానులు పాల్గొన్నారు.

కళా దర్బార్ ఆధ్వర్యంలో

బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అన్నమయ్య కళావేదికపై కళా దర్బార్ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు పాత్తూరి రంగారావు ఆధ్వర్యంలో గురువారం వివిధ రంగాల్లోని విశిష్ట వ్యక్తులకు ఉగాది పురస్కారాల్ని ప్రదానం చేశారు. సభకు రంగారావు అధ్యక్షత వహించారు. విద్యా రంగంలో యలవర్తి కోటేశ్వరమ్మ, వైద్య రంగంలో చింతా రామకృష్ణ, సంగీతంలో బి. జ్యోతిర్మయి, నృత్యంలో స్వాతి సోమనాథ్, సామాజిక సేవలో కె.పి. రంగారావు, కళా రంగంలో అంబటి మధుమోహన్‌కృష్ణ, ఆధ్యాత్మికతలో పాతూరి నాగభూషణం, సంక్షేమ రంగంలో చాగంటి పరమేశ్వరరెడ్డికి పురస్కారాలు అందించి సత్కరించారు. ముందుగా అంతర్జాతీయ నృత్య కళాకారిణి స్వాతి సోమనాథ్ ఆధ్వర్యంలో కిన్నెరసాని నృత్య ప్రదర్శన ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, బాలస్వామి, బి. చంద్రబాబు, జి. రమేష్ బాబు, సూర్య ప్రకాష్, కె.బాబూరావు పాల్గొన్నారు.

త్యాగధనులను స్మరించుకోవడం అందరి బాధ్యత

గుంటూరు ఎడ్యుకేషన్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) గుంటూరు నగర శాఖ ఆధ్వర్యంలో లాడ్జి సెంటర్‌లోని స్వామి వివేకానందుని విగ్రహం వద్ద బలిదాన్ దివాస్ సందర్భంగా కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సాయి చరణ్ కొత్త మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లను తలుచుకోవడం మన బాధ్యతని తెలిపారు. ఆనాడు వాళ్లు చేసిన త్యాగాల ఫలాలు ఈరోజు మనం అనుభవిస్తున్న జీవితమని పేర్కొన్నారు.

యావత్ విద్యార్థులు, యువత వారి త్యాగాల్ని ఆదర్శంగా తీసుకొని ఆశయ సాధన కోసం, భారతదేశ అభివృద్ధి కోసం నిరంతరం పని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ గుంటూరు జిల్లా కన్వీనర్ దివాకర్, ఉదయ్, తిరుపతి రెడ్డి, పవన్ పాల్గొన్నారు.

భర్త, మామపై వరకట్న వేధింపుల కేసు నమోదు

చేబ్రోలు: భర్త, మామ అధిక కట్నం కోసం మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని చేబ్రోలుకు చెందిన మహిళ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదవపాలేనికి చెందిన స్వాతికి ఇదే ప్రాంతానికి చెందిన వేపూరి వీరాంజనేయులతో ఐదు సంవత్సరాల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు కూడా ఉన్నారు. పెళ్లి అనంతరం భర్త వీరాంజనేయులు, మామ శ్రీనివాసరావు పుట్టింటి నుంచి అధిక కట్నం తీసుకురావాలంటూ మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేస్తున్నారు. రెండో ఆడపిల్ల పుట్టినప్పటి నుంచి భర్త కాపురానికి తీసుకెళ్లకుండా పది లక్షల రూపాయల అధిక కట్నం తీసుకురావాలని, లేకపోతే చంపుతానని బెదిరిస్తున్నట్లు స్వాతి ఫిర్యాదులో పేర్కొంది.

ఈ మేరకు భర్త, మామలపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె. ఆనంద్ తెలిపారు.

పాత విధానంలోనే బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలి

గుంటూరు ఎడ్యుకేషన్: మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల్ని పాత విధానంలోనే జరపాలని ఏపీటీఎఫ్ (1938) జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. నగరంపాలెంలోని సంఘ జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులందరినీ ఒకే గొడుగు కిందకు తెచ్చి బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టాలని అధికారులు భావించడం సరికాదన్నారు. ప్రస్తుతం ఒక జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు ఒక యూనిట్‌గా ఉండగా, గ్రేటర్ విజయవాడ, గ్రేటర్ విశాఖపట్నానికి వేర్వేరుగా ఉన్న సర్వీసు రూల్స్ పరిధిలోనే బదిలీలు, ఉద్యోగోన్నతులు జరుగుతున్నాయని, దాన్నే కొనసాగించాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్టిబోయిన నరసింహారావు మాట్లాడుతూ నగరపాలక సంస్థ, పురపాలక సంఘాలను ఒకే యూనిట్‌గా తీసుకుని బదిలీలు, ఉద్యోగోన్నతుల్ని నిర్వహించడమంటే విద్యాశాఖ స్థానిక సంస్థల అధికారాల్ని హరించడమేనని తెలిపారు. సమావేశంలో నగర శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయి మల్లికార్జునరావు, జోజప్ప పాల్గొన్నారు.





